క్లుప్తంగా

పెండింగ్ స్కాలర్‌షిప్ విడుదల చేయండి



నిరసన తెలుపుతున్న విద్యార్థులు

పాల్వంచరూరల్: పెండింగ్ స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని, మెస్, కాస్మొటిక్స్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ విద్యార్థులు ఆదివారం స్థానిక ప్రీమెట్రిక్ వసతి గృహం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీ సభ్యులు రామ్‌చరణ్ మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ పెండింగ్‌లో ఉందని, వెంటనే విడుదల చేయాలని, వసతి గృహాలకు డైట్ బిల్లులు ప్రతీనెల సకాలంలో ఇవ్వాలని, ప్రతీ మండలానికి రెగ్యూలర్ ఎంఈఓలను నియమించాలని డిమాండ్ చేశారు.

బీసీ కార్పొరేషన్ నిధులు మంజూరు చేయండి


నిరసన తెలుపుతున్న నాయకులు

కొత్తగూడెంరూరల్: బీసీ కార్పొరేషన్ నిధులు వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ మూన్నూరు కాపులు ముఖాలకు కండువాలు కట్టుకుని ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. లక్ష్మీదేవిపల్లి మండల కేంద్రంలో సంఘం నాయకులు మౌన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... మూన్నూరు కాపు బీసీ బాలబాలికల వసతి గృహాలకు ప్రభుత్వం కార్పొరేషన్ నిధులు మంజూరు చేయాలని, మూన్నూరు కాపు కార్పొరేషన్ కమిటీని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం బాధ్యులు హనుమంతరావు, వల్లాల ప్రసాద్, జె.తారక్, కోల నర్సయ్య, పెంచాల సంపత్, సారంగపాణి, బి.శ్రీనివాస్, మురళి, దొడ్డ సురేష్, వెంగళ రావు, సూరయ్య, కొత్వాల ఉమామహేశ్వర రావు పాల్గొన్నారు.

ప్రహరీలు కూల్చివేత


ప్రహరీలను కూల్చిన దృశ్యం

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం పట్టణ పరిధి రైటర్‌బస్తీ గొల్లగూడెం 31వ వార్డులో మున్సిపల్ అధికులు దారి కోసం అని ఏళ్ల తరబడిన నివాసం ఉంటున్న వారి ఇళ్ల ప్రహరి గోడలను నోటిసులు కూడా ఇవ్వకుండా శనివారం కూల్చివేశారు. నాలుగు ఇళ్ల ప్రహరీలు, మరుగుదొడ్లు కూల్చివేయడం వలన బాధిత కుటుంబసభ్యులు అవస్థలు పడుతున్నారు. కూల్చివేతల వలన ఆ ఏరియాలలో డ్రెయినేజీలు మూసుకపోవడం వలన మురుగు ఇళ్లల్లోకి చేరుచేరుతుండడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. అధికార పార్టీకి చెందిన ఓ ఇంటికి కారు వెళ్లేందుకు ఈ కూల్చివేతలు జరిగినట్లు స్థానికులు గుసగుసలాడుకుంటున్నారు.

గిరిజన ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి..


మాట్లాడుతున్న రాజేష్‌నాయక్

కొత్తగూడెంటౌన్: తక్షణమే గిరిజన నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాజేష్‌నాయక్ డిమాండ్ చేశారు. ఆదివారం కొత్తగూడెం బస్టాండ్ సెంటర్ ఏరియాలో జరిగిన ఎస్టీ సంఘాల ఐక్య వేదిక సమావేశంలో రాజేష్‌నాయక్ పాల్గొని మాట్లాడారు. ఏజెన్సీ ప్రాంతంలో ప్రభుత్వం తక్షణమే ట్రైబల్ అడ్వైజర్ కమిటీ తీర్మానం చేసి 100 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని కోరారు. ఎస్టీల రిజర్వేషన్‌ను కేంద్ర ప్రభుత్వం తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చేలా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలన్నారు. 1996 పెసా చట్టం ప్రకారం స్థానిక గిరిజన అభ్యర్థులతోనే 100 శాతం భర్తీ చేయాలని పేర్కొన్నారు. 29 ప్రభుత్వ శాఖలలో 100 శాఖలలో రిజర్వేషన్ అమలు చేయాలని, ఎస్టీ ఆదివాసీలు సాగు చేస్తున్న పోడు లావణి భూములకు శాశ్వతంగా పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో హాథీరాం, ప్రకాష్‌దొర, కేశవ్ నాయక్, ఉపేందర్‌నాయక్, రాంజీనాయక్, కిరణ్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్రంగా సాగు లెక్కలు

- ముమ్మరంగా వానాకాలం పంటల సర్వే
- క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది


పంటల వివరాలు సేకరిస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది



సుజాతనగర్: వానాకాలం పంటల నమోదు ప్రక్రియ ముమ్మరంగా కొనసాగుతోంది. వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ.. సర్వే నంబర్ల వారీగా ఏ రైతు ఎంత విస్తీర్ణంలో ఏ పంటలు సాగుచేశారనే వివరాలను సమగ్రంగా సేకరిస్తున్నారు. ఆయా వివరాలను ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో నమోదు చేస్తున్నారు. ఈ సర్వే ఆధారంగా పంటలకు అవసరమయ్యే ఎరువులు సమకూర్చడంతో పాటు పంట కొనుగోళ్ల సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టే అవకాశం ఉంటుంది. సుజాతనగర్ మండల వ్యాప్తంగా పంటల సాగు వంద శాతం పూర్తి కావడంతో ఈ నెల 1 నుంచి సర్వే ప్రారంభించారు. అయితే ముందస్తుగా పత్తి వేసిన పంట సర్వే ఇప్పటికే పూర్తి కాగా.. ఆలస్యంగా సాగు చేసిన పంటలకు సంబంధించి సర్వే కొనసాగుతోంది.

ఈ ఏడాది ఆశాజనకంగా పంటల సాగు...

మండలంలో గతేడాది 11,118 ఎకారాల్లో ఎకరాల్లో వివిధ రకాల పంటలను సాగుచేయగా.. ఈ ఏడాది 13,946 ఎకరాల్లో పంటలు సాగుచేసే అవకాశం ఉందని సంబంధిత అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ మేరకు ప్రణాళికలు రూపొందించారు. ఇప్పటికే పత్తి, జొన్న, మొక్కజొన్న, కందులు తదితర పంటల వివరాల నమోదు ప్రక్రియ పూర్తి కాగా.. వరి పంట సర్వే కొనసాగుతోంది. ఇప్పటి వరకు వ్యవసాయాధికారులు సేకరించిన వివరాల ప్రకారం...11,126 ఎకరాల్లో రైతులు వివిధ పంటలను రైతు సాగుచేశారు. అందులో అత్యధికంగా 10,733 ఎకరాల్లో పత్తి, 183 ఎకరాల్లో వరి, 38 ఎకరాల్లో మొక్కజొన్న, 6 ఎకరాల్లో పెసర, 31 ఎకరాల్లో కందులు, 5 ఎకరాల్లో మిరప, ఆయిల్ పాం 130 ఎకరాల్లో సాగు చేశారు. వరి పంట మొత్తం 3 వేల ఎకారాల్లో సాగు చేసే అవకాశం ఉండగా.. ప్రస్తుతానికి 183 ఎకరాల విస్తీర్ణంలో సాగు చేశారు.

అత్యధికంగా పత్తి సాగు..

తెల్లబంగారంగా పిలవబడే పత్తి సాగు సుజాతనగర్ మండలం అంతటా ఆశాజనకంగా కనిపిస్తోంది. కోయగూడెం, సీతంపేట, కోమటిపల్లి, నిమ్మలగూడెం, పాత అంజనాపురం, కొత్త అంజనాపురం, సింగభూపాలెం, బేతంపూడి, సింగభూపాలెం, జామ్లా తండా తదితర గ్రామాల పరిధిలో అత్యధికంగా ఈ పంటను సాగుచేశారు. గత ఏడాది క్వింటా పత్తి ధర రూ.7 వేల నుంచి రూ.8 వేల వరకు పలికింది. ఆశించిన దిగుబడులు కొంతవరకు వచ్చాయి. ఈ ఏడాది మొదట్లో విస్తారంగా కురిసిన వర్షాలు అనంతరం ముఖం చాటేశాయి. విత్తనాలు విత్తిన తర్వాత అవి మొలకెత్తకపోవడంతో రైతులు రెండు, మూడుసార్లు పత్తి విత్తనాలను విత్తుకోవాల్సి వచ్చింది. దీంతో రైతులకు అదనపు భారం పడింది. విస్తారంగా కురిసిన వర్షాల మూలంగా కలుపు కూడా అధికంగా రావడంతో రైతులు కలుపు తీత ఖర్చులు అదనం అయ్యాయి. ప్రస్తుతం పత్తి పంట పూత దశలో ఉంది. మరో నెల రోజుల్లో పంట చేతికి వచ్చే అవకాశం ఉండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రూ.60 వేల పెట్టుబడి అయింది...



మూడు ఎకరాల్లో పత్తి పంట సాగుచేశాను. ఇప్పటి వరకు రూ.60 వేల పైనే పెట్టుబడి అయింది. నెల రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. చేలల్లో నీరు నిలిచి మొక్కలు ఎర్రబారుతున్నాయి. ఆశించిన దిగుబడి రాదేమో అనిపిస్తోంది.

– మారుతీ పెద్ద వెంకన్న, రైతు, గరీబ్‌పేట

పంటల వివరాలు నమోదు చేస్తున్నాం



ముందుగా సాగుచేసిన పంటల వివరాల నమోదు ఇప్పటికే పూర్తయింది. ఆలస్యంగా వేసిన పంటల వివరాలను సేకరిస్తున్నారు. ఎవరైనా రైతుల వివరాలు నమోదు కాకపోతే, సంబంధిత అధికారులను సంప్రదించి నమోదు చేయించుకోవాలి.

– గాంధ్ల నర్మద, మండల వ్యవసాయాధికారి

పూర్తిస్థాయి డిపో ఏర్పాటు చేయాలి


మాట్లాడుతున్న నాయకులు

ఇల్లెందు: ఇల్లెందులో ఏర్పాటు చేసిన శాటిలైట్ ఆర్టీసీ డిపోను పూర్తిస్థాయి డిపోగా మార్చాలని, ప్రాంగణంలో ఆయిల్ బంక్ ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మాచారి డిమాండ్ చేశారు. ఆదివారం ఇల్లెందు ఆర్టీసీ డిపో సీఐటీయూ అనుబంధ కార్మిక సంఘం తెలంగాణ ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ప్రథమ మహాసభ ఏలూరి భవన్‌లో జరిగింది. తొలుత సంఘం జెండాను ఎం.శ్రీనివాసరావు ఎగుర వేశారు. బ్రహ్మాచారి, వీరాంజనేయులు మాట్లాడుతూ.. డిపోలో మహిళలకు ప్రత్యేక సదుపాయాలు కల్పించాలని కోరారు. రెస్ట్ రూమ్, ఆర్వో ప్లాంట్, సైకిల్ స్టాండ్ సదుపాయం కల్పించాలని కోరారు. ఐదు నెలల పెండింగ్ ఓటీ బిల్లులు చెల్లించాలని కోరారు. కొత్త బస్‌లు ఏర్పాటు చేయాలని, ఇల్లెందు చుట్టుపక్కల పల్లె వెలుగు సర్వీస్‌లు, మిర్యాలగూడ, మణుగూరు, హనుమకొండ, విజయవాడ, భద్రాచలం, గుండాల నుంచి హైదరాబాద్‌కు లగ్జరీ బస్ సర్వీసులను ప్రవేశపెట్టాలని కోరారు. గడ్డం లింగమూర్తి, బాణాల రాంబాబు, సుధాకర్, అబ్దుల్ నబీ, తాళ్లూరి కృష్ణ, బాబు, ఉపేంద్ర చారి, అంజి, నాగరాజు, పీఎల్ రావు, జాకబ్, సైదమ్మ, అలీ, భిక్షమయ్య, వేణు, సురేష్, శైలజ పాల్గొన్నారు.

ఏడీఏకు సన్మానం


వాసవీరాణిని సత్కరిస్తున్న వ్యాపారులు

ఇల్లెందు: ఇల్లెందు సబ్ డివిజన్ వ్యవసాయ శాఖ అధికారిగా ఏడేళ్ల విధులు నిర్వహించిన వాసవీరాణికి ఇల్లెందు ఫర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్ వ్యాపారుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఓ సతీష్, ఫర్టిలైజర్స్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు ప్రొద్దుటూరి నాగేశ్వరరావు, సోమసుందర్, రామలింగయ్య, సొసైటీ చైర్మన్ మెట్ల కృష్ణ, కిన్నెర నర్సయ్య, రాంబాబు, చెన్నూరి కృష్ణ, ఉపేందర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రెస్‌క్లబ్ కమిటీకి...


సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

టేకులపల్లి: టేకులపల్లి ప్రెస్‌క్లబ్ నూతన కమిటీని ఇటీవల ఎన్నుకున్నారు. ఈ మేరకు ఆదివారం కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు కోరం సురేందర్ ఆధ్వర్యంలో అధ్యక్షుడు గుగ్రం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి బానోతు దస్రునాయక్, కోశాధికారి గంగారపు శేషయ్య, ఉపాధ్యక్షుడు ఎండీవై పాషా, సహాయ కార్యదర్శి రాయల ప్రశాంత్‌లకు శాలువాలు కప్పి సన్మానించారు.

బదిలీ వైద్య ఉద్యోగులకు..


ఉద్యోగులను సన్మానిస్తున్న వైద్య సిబ్బంది

జూలూరుపాడు: స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆదివారం బదిలీ వైద్యుడు, ఉద్యోగులను ఘనంగా సన్మానించి, వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డీఎంహెచ్ఓ డాక్టర్ భాస్కర్ నాయక్ హాజరయ్యారు. ఇటీవల బదిలీ అయిన దంత వైద్య నిపుణులు డాక్టర్ పోటు వినోద్, సీహెచ్ఓ వెంకటేశ్వర్లు, ఫార్మసిస్ట్ గుగులోత్ శశికళ, యూడీసీ వెంకటేశ్వరరావు, హెల్త్ సూపర్‌వైజర్ సుభద్రమ్మ, ఏఎన్ఎం రాజమ్మలకు శాలువాలు కప్పి సన్మానించి, మెమెంటోలు అందజేశారు. అదేవిధంగా నూతనం బాధ్యతలు స్వీకరించిన వారికి స్వాగతం పలికారు.

27న టీబీజీకేఎస్ సమావేశం

సింగరేణి(కొత్తగూడెం): ఈనెల 27న భూపాలపల్లిలోని కేటీకే కమాన్ వద్ద తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) కేంద్ర కమిటీ సమావేశం నిర్వహించనున్నట్లు, ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాపు కృష్ణ తెలిపారు. ఆదివారం ఏరియా పరిధి రామవరంలోని యూనియన్ కార్యాలయంలో ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. యూనియన్ నిర్మాణం, కార్యాచరణ, విద్య, వైద్యం, కార్మికుల రక్షణపై చర్చ, లాభాల వాటాలపై అవలంబించాల్సిన కార్యక్రమాల ప్రణాళికపై చర్చించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో కూసన వీరభద్రయ్య, గడప రాజయ్య పాల్గొన్నారు.

షరతులు లేకుండా రుణమాఫీ చేయండి..



మాట్లాడుతున్న రాంచందర్ నాయక్

టేకులపల్లి: షరతులు లేకుండా రైతుల రుణమాఫీ చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం మండల కార్యదర్శి గుగులోత్ రాంచందర్ నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం మండల కేంద్రంలో జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని రైతులందరికీ రూ.రెండు లక్షలు రుణమాఫీ చేస్తానని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, గద్దెనెక్కిన తర్వాత నేడు కొర్రీలు పెడుతోందని విమర్శించారు. రైతు భరోసా, రైతుకూలీ భరోసా, అన్ని రకాల వరి ధాన్యానికి బోనస్ నీటిమీద రాతలుగానే మిగిలిపోయాయని విమర్శించారు. నూతనంగా రైతులందరికీ పంట రుణాలు అందించాలని, రైతు భరోసా ఎకరానికి రూ.15 వేలు ఇవ్వాలని, అన్ని రకాల ధాన్యాలకు రూ.1500 బోనస్ చెల్లించాలని, రైతు కూలీలకు సంవత్సరానికి రూ.1200 చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కల్తి వెంకటేశ్వర్లు, డి.ప్రసాద్, బిల్లు నాగేందర్, బానోతు వెంకట్రాం తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మతల్లికి బోనాలు


పాల్వంచరూరల్: బోనాలు సమర్పిస్తున్న మహిళలు


సుజాతనగర్: సిరిపురంలో బోనాలతో వస్తున్న భక్తులు

పాల్వంచరూరల్: మున్సిపాలిటీ పరిధి గాంధీనగర్‌లోని ముత్యాలమ్మతల్లి ఆలయంలో శ్రావణమాసం మూడో ఆదివారం మహిళలు ఇంటింటికీ బోనం ఎత్తుకుని అమ్మవారికి సమర్పించి ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త గంగపూరి నాగేశ్వరరావు, అర్చకులు గడ్డం భాస్కర్‌రావు, చింతలచెరువు రామ్మూర్తి, భాగ్యలక్ష్మి, గోవర్దన్, సీహెచ్ చంద్రకళ, భాస్కర్, సాగర్, నాగమణి పాల్గొన్నారు.

సుజాతనగర్: సిరిపురం, నాయకులగూడెం గ్రామాల్లో ఆదివారం బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలు నెత్తిన పెట్టుకుని డప్పు వాయిద్యాలతో ఊరేగింపుగా ముత్యాలమ్మగుడికి చేరుకుని అమ్మవారికి బోనాలను సమర్పించి, పూజలు నిర్వహించారు. వర్షాలు సమృద్ధిగా రావాలని, పంటలు పండాలని, గ్రామస్తులంతా ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని కోరుకున్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


2003-2004 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

పాల్వంచరూరల్: బొల్లోరిగూడెంలోని హైస్కూల్‌లో 2003–2004లో పదో తరగతి చదువుకున్న 80 విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. నాటి ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. చందాలు వేసుకుని హైస్కూల్ అభివృద్ధికి రూ.21వేలు వితరణ అందించారు. ఈ కార్యక్రమంలో నాటి హెచ్ఎం నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, పార్థసారధి, తులసి, సీతామహాలక్ష్మి, సువర్ణ, పూర్వవిద్యార్థులు కిరణ్, ప్రసాద్, ప్రవీణ్ కుమార్ ఉన్నారు.

వందేళ్లుగా ఎర్రజెండా పేదల పక్షం..



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని

చండ్రుపల్లి: కార్మికులకు, కర్షకులకు, పేదవర్గాలకు ఎర్రజెండా అండగా నిలుస్తుందని, వందేళ్లుగా ప్రజల పక్షానే నిలుస్తూ బలమైన రాజకీయ శక్తిగా సీపీఐ నిలబడిందని కొత్తగూడెం కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. చండ్రుపల్లి మండలం పెనగడప గ్రామంలో ఆదివారం జరిగిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఎన్నడూ లేని విధంగా ఎనిమిది నెలలుగా నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపట్టినట్లు చెప్పారు. ప్రజలు సుదీర్ఘంగా ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రధానంగా తాగునీరు, అంతర్గత రోడ్లు, డ్రెయినేజీలు, విద్యుత్ వంటి ప్రధాన సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా సాబీర్‌పాషా నేతృత్వంలో వివిధ పార్టీల నుంచి సీపీఐలో చేరిన 120 కుటుంబాల వారికి కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కే సాబీర్‌పాషా, చంద్రగిరి శ్రీనివాసరావు, సలిగంటి శ్రీనివాసరావు, వాసిరెడ్డి మురళీ, జీ.వీరస్వామి, బొర్రా కేశవరావు పాల్గొన్నారు.

పాల్వంచరూరల్: ప్రజాసమస్యలను పరిష్కారిస్తూ నియోజకవర్గ అభివృద్ధి కోసం కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. కిన్నెరసానిలో ఆదివారం ఆత్మీయ సమ్మెళన సభ జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి 150 మంది పార్టీలో చేరినట్లు తెలిపారు. పార్టీలో చేరుతున్న నాయకులు ప్రజా సంఘాల నాయకులు బాధ్యతలు స్వీకరించి నిత్యం ప్రజలతో మమేకవుతూ పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలన్నారు.

రాజకీయ స్వార్థంతోనే ఎస్సీ వర్గీకరణ


అభివాదం చేస్తున్న నాయకులు

జూలూరుపాడు: ఎస్సీ వర్గీకరణను కొందరు రాజకీయ స్వార్థం కోసం వాడుకుంటున్నారని మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు పూల రవీందర్ అన్నారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకరంగా జూలూరుపాడు మండల మాలమహానాడు ఆధ్వర్యంలో జూలూరుపాడు న్యూకాలనీలో ఆదివారం మాలల ఆత్మీయ సమేళ్మనం నిర్వహించారు. రవీందర్ మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత లేదన్నారు. ఎస్సీ వర్గీకరణతో మాలలకు అన్యాయం జరుగుతుందని, దీనిపై పునరాలోచన చేయాలన్నారు. ఈ విషయంలో మాలలు ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా జరుగుతున్న ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాటానికి సిద్ధంగా ఉండాలని, ఎస్సీ వర్గీకరణ వెనక్కి తీసుకునే వరకు సైనికుల్లా కొట్లాడాలన్నారు. దీనికోసం జిల్లా వ్యాప్తంగా మండల కమిటీలను నియమించనున్నట్లు చెప్పారు. జూలూరుపాడు మండల అధ్యక్షుడిగా బుడిపూడి ప్రభాకర్‌ను నియమిస్తూ నియామకపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో శీలం రాజేష్, రంజిత్ కుమార్, వెంకటముత్యం, పోతురాజు రామారావు, బడుగు వీరస్వామి, బరగడ రమేష్, పప్పుల జాను, బుడిపూడి ప్రతాప్, గోపయ్య పాల్గొన్నారు.

ఘనంగా వనభోజన మహోత్సవం


వనంలో ఆదివాసీలు

ఇల్లెందురూరల్: మండలంలోని 21పిట్ ఏరియాకు చెందిన ఆదివాసీలు కుటుంబ సభ్యులతో ఆదివారం శ్రావణమాస వనభోజనాలకు అడవికి తరలివెళ్లారు. వనదేవతకు ప్రత్యేక పూజలు చేశారు. సంప్రదాయ పద్ధతిలో నృత్యాలతో సంబురాలు జరుపుకున్నారు. అక్కడే భోజనాలు వండుకొని వనదేవతకు నైవేద్యంగా సమర్పించారు. సహపంక్తి భోజనాలు చేశారు.

డబుల్ బెడ్‌రూం కాలనీలో పారిశుద్ధ్యం అధ్వానం


డబుల్ బెడ్‌రూమ్ కాలనీ

టేకులపల్లి: మండల కేంద్రంలో నెలకొన్న డబుల్ బెడ్ రూం కాలనీలో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. 2017 జనవరిలో ఆనాడు మంత్రిగా ఉన్న తుమ్మల నాగేశ్వరరావు, అప్పటి ఎమ్మెల్యే కోరం కనకయ్య 20 డబుల్ బెడ్ రూం ఇళ్ల కాలనీని ప్రారంభించారు. ఆనాటి నుంచి నేటి వరకు ఈ కాలనీలో డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేదు. సైడుకాలువలు నిర్మించినా మట్టితో కూరుకుపోయింది. మురుగునీటి పారుదల లేదు. ఈ కాలనీకి మూడు వైపులు పంట పొలాలు. ఒక వైపు ప్రధాన రహదారి ఉంటుంది. 2017 నుంచి కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పారిశుద్ధ్యం లేదు. దీంతో స్థానికులు జ్వరాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి పక్కా డ్రెయినేజీలు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

యూపీఎస్ వద్దు.. ఓపీఎస్ ముద్దు

టేకులపల్లి: కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొస్తున్న యూపీఎస్ విధానం రద్దు చేసి ఓపీఎస్ విధానాన్ని పునరుద్ధరించాలని సీపీఎస్ బాధిత ఉపాధ్యాయ సంఘాల నాయకులు మూడు రమణ, పూల్‌సింగ్, నాగునాయక్, హతీరామ్, సురేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం వారు మండల కేంద్రంలో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 2004 సెప్టెంబర్ 1 నుంచి అమలులోకి వచ్చిన పీఎఫ్ఆర్‌డీఏ చట్టం ద్వారా సీపీఎస్ పేరు మీద అమలవుతున్న పెన్షన్ విధానాన్ని ఇరవై ఏళ్లుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులు వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. కనీసం ఉద్యోగి చనిపోతే ఆర్థిక భరోసా లేక భార్యా బిడ్డలు రోడ్డున పడుతున్నారని వాపోయారు. ఉద్యోగులపై ఆధారపడిన తల్లిదండ్రులకు తన వృద్ధాప్యంలో కనీస భరోసా లేని పెన్షన్ విధానం వల్ల కుటుంబ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారుతుందని పేర్కొన్నారు. రిటైర్డ్ ఉద్యోగులు దుకాణాల్లో రోజువారీ కూలీలుగా పని చేస్తున్న దుస్థితి ఏర్పడిందన్నారు. ఈ పరిస్థితికి వ్యతిరేకంగా ఉద్యోగ, ఉపాధ్యాయులు పోరాటాలు చేస్తున్నారని అన్నివర్గాల వారు మద్దతు తెలపాలని కోరారు. తమకు ఓపీఎస్ తప్ప వేరే ఏ విధానం వద్దని పోరాటాలు చేస్తుంటే ఎన్నికలకు ముందు ఒక కమిటీ వేసిన నరేంద్ర మోడీ ప్రభుత్వం ఇప్పుడు యూనిఫైడ్ పెన్షన్ స్కీం (యూపీఎస్) పేరుతో ఇంకో కొత్త విధానం ప్రకటించడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. ఒకే సర్వీస్, ఒకే పెన్షన్ విధానం ఉండాలని కోరారు.

ప్రభుత్వాస్పత్రికి మరమ్మతులు


ఇల్లెందు ప్రభుత్వాస్పత్రి



లీకవుతున్న పైకప్పు, గోడలు

ఇల్లెందు: ఇల్లెందు ప్రభుత్వాస్పత్రి మరమ్మతు పనులకు రూ.62 లక్షలు నిధులు కేటాయిస్తూ పరిపాలనా అనుమతులు ఇచ్చారు. డీఎంఎఫ్‌టీ నిధులతో ఈ పనులు పూర్తి చేయాలని నిర్ణయించారు. విద్యుత్ మరమ్మతులు, రెనవేషన్ కోసం రూ.17.25 లక్షలు, ఆస్పత్రి భవనం పైకప్పు లీకులు మరమ్మతులకు రూ.25 లక్షలు కేటాయించారు. మరుగుదొడ్లు, సెప్టిక్ ట్యాంకు రిపేర్లకు రూ.9.85 లక్షలు, తలుపులు, కిటికీలు, రెయిలింగ్, రంగులు వేసేందుకు రూ.9.90 లక్షలు మంజూర చేశారు. తెలంగాణ మెడికల్ సర్వీసెస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీజీఎంఎస్ఐడీసీ) ద్వారా టెండర్ పిలిచి పనులు ప్రారంభించాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అధికారులను ఆదేశించారు.

లీకవుతున్న పైకప్పు.. పొంచి ఉన్న ప్రమాదం..

ఇల్లెందు ప్రభుత్వాస్పత్రి పైకప్పు గోడులు లీకు అవుతుందటంతో ప్రమాదం పొంచి ఉంది. విద్యుత్ లైన్లు, స్విచ్ బోర్డులు షార్ట్ సర్క్యూట్ అవుతోంది. ఆస్పత్రి భవనం రెండు విభాగాలుగా ఉంది. 2000 సంవత్సరంలో కొత్త భవనం నిర్మాణం చేశారు. ఈ భవనానికి విద్యుత్ వైరింగ్‌లో పీవీసీ పైపులు వాడారు. ఇక పాత భవనం 1970కి పూర్వం నిర్మించారు. అప్పడు విద్యుత్ వైరింగ్ కోసం ఐరన్ పైపులు వాడారు. దీనివల్ల ప్రమాదం జరుగుతోంది. దీనిపై స్థానిక ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆరా తీశారు. ఆస్పత్రి అధికారులు అందజేసిన రిపోర్టును అటు కలెక్టర్‌కు ఇటు మంత్రులకు అందజేశారు. దీంతో నిధులు మంజూరు చేస్తూ అడ్మినిస్ట్రేషన్ అనుమతులు ఇచ్చారు.

టెండర్ ప్రక్రియ ప్రారంభం అయినట్లే...



ఆస్పత్రిలో గోడలు, పైకప్పు లీకులు అవుతుండటం వల్ల ప్రమాదం పొంచి ఉంది. దీనిపై స్థానిక ఎమ్మెల్యే కోరం కనకయ్య, కలెక్టర్‌కు నివేదిక అందజేశాము. రూ.62 లక్షలు కేటాయించారు. త్వరలో టెండర్ పిలుస్తారు.

– డాక్టర్ జి.హర్షవర్ధన్, సూపరింటెండెంట్, ఇల్లెందు ప్రభుత్వాస్పత్రి